సాక్షి వరంగల్

సోమవారం | 19 | మే | 2025



ముగిసిన నెట్‌బాల్ పోటీలు

జనగామలోని బతుకమ్మకుంటలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి.

- 8లో ▸



అన్నదానం..మహాప్రసాదం

సరస్వతి నది పుష్కరాలకు వచ్చే భక్తులకు కాళేశ్వరంలోని ముక్తీశ్వరాలయ సమీపంలో అన్నదాన సత్రాలు ఏర్పాటు చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
$37^0 / 27^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ ఎక్కువ ఉంటుంది. సాయంత్రం వేళ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు మొండ్రాయి విద్యార్థులు



ప్రణయ్‌వర్ధన్



వర్షిత్

సంగెం: రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలకు మొండ్రాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు కె.విజయ, పీడీ ముఖర్జీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 30న ఓ సిటీలో వరంగల్ జిల్లాస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్ పోటీల్లో విద్యార్థులు పి.ప్రణయ్‌వర్ధన్, డి.వర్షిత్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 19 నుంచి 21వ వరకు మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరుగనున్న 11వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ శ్రీలత, పాఠశాల హెచ్‌ఎం విజయ, పీడీ ముఖర్జీ, ఉపాధ్యాయులు అభినందించారు.

కల్లెడలో జామాయిల్ తోట దగ్ధం



పర్వతగిరి: కల్లెడ గ్రామ శివారులోని కరిమిళ్ల సోమేశ్వరరావు, ఎన్నమనేని మోహన్‌రావుకు చెందిన జామాయిల్ తోట నిప్పంటుకొని ఆదివారం దగ్ధమైంది. జామాయిల్ తోట పక్కన ఉన్న పొలంలో రైతు వరి కొయ్యలను అంటు పెట్టాడు. దీంతో పక్కన ఉన్న జామాయిల్ తోటకు మంటలు వ్యాపించడంతో దగ్ధమైంది. 15 ఎకరాల్లో 12 ఎకరాల జామాయిల్ తోట పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.30 లక్షల వరకు నష్టం జరిగిందని రైతులు తెలిపారు.

రేపటి నుంచి పీజీ కోర్సుల పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో పీజీ కోర్సుల నాలుగో సెమిస్టర్(నాన్ ప్రొఫెషనల్)రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ పరీక్షలు ఈనెల 20 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య సౌజన్య ఆదివారం తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్‌ఆర్‌ఎం, జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ తదితర కోర్సుల పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 20, 22, 24, 27, 29, 31 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. కాకతీయ యూనివర్సిటీలో పరిధిలో పీజీ కోర్సుల పరీక్షల నిర్వహణకు 26 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4,300 మంది పరీక్షలు రాయనున్నట్లు వారు తెలిపారు.

డైక్ కాంట్రాక్ట్ సిబ్బంది ఇష్టారాజ్యం



సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డైక్)లో కాంట్రాక్ట్ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొద్ది నెలల నుంచి సిబ్బంది అసలు విధుల్లో లేకుండానే విధులకు హాజరైనట్లు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నారు. ఇంకా కొన్ని సందర్భాల్లో ఏకంగా విధులకు హాజరవ్వకుండా డైక్ సెంటర్‌కే తాళం వేసిన ఘటనలున్నట్లు బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. సిబ్బంది విధులకు డుమ్మా కొడుతుండడంతో బాధిత పిల్లలకు సేవలు ఎలా అందిస్తారంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డైక్ సెంటర్ కాంట్రాక్ట్ సిబ్బందిలో ఓ ఉద్యోగిని ఎవరైనా ప్రశ్నిస్తే.. ప్రముఖ దినపత్రిక చీఫ్ బ్యూరో నా చుట్టం.. మీరేం చేసుకుంటారో చేసుకోండి అంటూ.. చిందులు తొక్కుతుండడం గమనార్హం. ఎంజీఎం డైక్ సెంటర్‌లో అర్హత లేని వ్యక్తులు ఉద్యోగాలు పొందారని, నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగ నియామకాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డైక్ సెంటర్ కాంట్రాక్టు సిబ్బంది తీరు, నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగ నియామకాలపై కలెక్టర్ విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలంటూ ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

దాహం.. దాహం

- గొంతు తడపని మిషన్ భగీరథ
- నర్సంపేటలో రెండు రోజులకోసారి నీటి సరఫరా
- వేసవిలో పట్టణ ప్రజలకు తప్పని తిప్పలు
- డీ ఫ్లోరైడ్ ప్రాజెక్టు డీలా.. నత్తనడకన అమృత్ పనులు



మల్లంపల్లి రోడ్డులో చేదబావి నుంచి నీటిని తోడుతున్న పట్టణ మహిళలు

నర్సంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నా తాగునీటి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. మిషన్ భగీరథ పథకం ద్వారా నర్సంపేట పట్టణంలో 40 శాతం మంది ప్రజలకు కూడా స్వచ్ఛమైన నీరు అందడం లేదు. అదనపు నిధులు కేటాయించి పనులు చేయాలంటే నిబంధనలు అడ్డు వస్తున్నాయి. దీంతో ప్రతీ వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య జఠిలంగానే మారుతోంది. నర్సంపేట మున్సిపాలిటీలో 24 వార్డులు ఉన్నాయి. ఇటీవల అదనంగా మరికొన్ని గ్రామాలు విలీనమయ్యాయి. 55 వేల నుంచి 60 వేలకు జనాభా పెరిగింది. ప్రతీ రోజు నీటి సరఫరా చేయలేని పరిస్థితి ఉంది. అధికారుల నిర్లక్ష్యంతో సరైన ప్రణాళికలు లేక 40 శాతం ప్రజలకు రంగు నీరే సరఫరా అవుతోంది. పట్టణ శివారు కాలనీల ప్రజలు ఇప్పటికీ చేదబావుల నుంచి నీటిని తోడుకుంటున్న పరిస్థితి కనిపిస్తోందంటే అభివృద్ధిపై అధికారుల అలసత్వం కనిపిస్తోంది.

ప్రతిరోజూ నీరందాలంటే..

పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన ప్రతిరోజూ నీరందాలంటే అశోక్‌నగర్ గ్రామ శివారులోని డీఫ్లోరైడ్ ప్రాజెక్టు అందుబాటులోకి రావాల్సి ఉంది. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రాజెక్టు సమస్యలను అధికారులను అడిగి తెలుసుకుని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. రూ.13 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి పట్టణ ప్రజలకు తాగునీరు అందించాలని ప్రతిపాదనలను సిద్ధం చేయించి ఉన్నతాధికారులకు పంపించారు. అయినప్పటికీ ఈ వేసవి కాలంలో పనులు ప్రారంభమయ్యే పరిస్థితి లేదు.

అభివృద్ధి పనుల్లో ఆలస్యం..

తాగునీరు అందించేందుకు పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 నుంచి రూ.30 కోట్ల నిధులతో సర్వాపురంలో చేపట్టిన ట్యాంకు నిర్మాణ పనులు 40 శాతమే పూర్తికావడంతో తాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదు. శాంతినగర్‌లో చేపట్టిన మిషన్ భగీరథ ట్యాంకు నిర్మాణ పనులది కూడా అదే పరిస్థితి. మరో రెండు నెలల్లో ట్యాంకు నిర్మాణ పనులు పూర్తి అవుతాయని అధికారులు భావిస్తున్నారు.



నీటి సమస్య పరిష్కరించాలని నర్సింగాపురం గ్రామంలో ఆందోళన చేస్తున్న మహిళలు



పూర్తికాని అమృత్ 2.0 ట్యాంకు నిర్మాణ పనులు

పల్లెల్లోనూ ఇదే పరిస్థితి..

గ్రామపంచాయతీల పరిధిలో కూడా తాగునీటి సమస్య ప్రజలను ఇబ్బందికి గురిచేస్తోంది. నిధుల కొరత ఉండడంతో పంచాయతీల్లో నీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చడంతో ప్రజలు ఆందోళనకు దిగుతున్నారు. నర్సంపేట మండలం ఇటుకాలపల్లి గ్రామపంచాయతీ శివారులోని నర్సింగాపురం గ్రామంలో ఆదివారం మహిళలు బిందెలతో నిరసన తెలిపారు. సీడీఎఫ్ నిధులతో వేసిన బోరును కేసింగ్ సరిగా వేయకపోవడంతో మూడు నెలలకే కూలిపోయింది. అధికారులు బోరును మరమ్మతు చేయించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, మిషన్ భగీరథ నీరు సరిగా రావడం లేదని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా తక్షణమే నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

సమస్య పరిష్కారం కావడం లేదు



తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో కొన్ని సంవత్సరాలుగా మల్లంపల్లి రోడ్డులోని కాలనీల ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ పథకం నీరు కాలనీకి రావడం లేదు. ప్రజలు చేద బావి ద్వారానే ఇప్పటికీ నీటిని తోడుకొని తాగాల్సిన పరిస్థితి నెలకొంది.

- వంగల రాగసుధ, గాంధీనగర్ నర్సంపేట

శాశ్వత పరిష్కారం చూపాలి



మిషన్ భగీరథ పైపులైన్ నీరు ప్రధాన రోడ్ల వెంట కొంత వరకే సరఫరా అవుతోంది. కాలనీ చివరి వరకు తక్కువ నీరే వస్తోంది. ప్రతీ వేసవిలో సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలి. పేదల దాహం తీర్చేందుకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇచ్చి స్వచ్ఛమైన నీటిని అందించాలి.

- జన్ను జమున, మార్క్స్ కాలనీ నర్సంపేట

క్రీడారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి
- విశాల్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

కేయూ క్యాంపస్: తెలంగాణలో క్రీడా రంగాభివృద్ధికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కుమారుడు నాయిని విశాల్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో నాయిని టీ-10 లీగ్ సీజన్ -2 క్రికెట్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2015లో దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో విశాల్‌రెడ్డి మరణించడంతో విశాల్ జ్ఞాపకాలను రాజేందర్‌రెడ్డి తన మనసులో ఉంచుకుని విశాల్ ట్రస్ట్ పేరుతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. విశాల్ ఆత్మకు శాంతిచేకూరేలా సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారన్నారు. విశాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్రసత్యనారాయణ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ సుధారాణి, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

హేమాచలుడి సన్నిధిలో భక్తుల రద్దీ



స్వామివారి సన్నిధిలో హనుమాన్ భక్తులు

మంగపేట: మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు(జాతర) ముగిసినా స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సంఖ్య ఆదివారం సైతం యథావిధిగానే కొనసాగింది. ఈనెల 8వ తేదీన అంకురార్పణతో ప్రారంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాలు శనివారం వసంతోత్సవంతో ముగిసిన విషయం తెలిసిందే. జాతర సమయంలో స్వామివారిని దర్శించుకునేందుకు రాలేకపోయిన వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులతోపాటు ప్రతి ఆదివారం ఆలయంలో నిర్వహించే స్వామివారి తిలతైలాభిషేకం పూజా కార్యక్రమంలో పాల్గొని సంతానం ప్రాప్తి కోసం స్వామివారి నాభి చందన ప్రసాదాన్ని స్వీకరించేందుకు వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసింది. హనుమాన్ మాలధారణ భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటలవరకు ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయ పూజారులు శేఖర్‌శర్మ, పవన్‌కుమార్, రాజీవ్ నాగఫణిశర్మ ఈశ్వర్‌చంద్ స్వామివారికి తిలతైలాభిషేకం పూజలు నిర్వహించారు. తిలతైలాభిషేకం పూజలో పాల్గొన్న భక్తులు స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని పులకించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తుల పేరిట ఆలయ పూజారులు గోత్రనామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించారు. స్వామివారి విశిష్టత, ఆలయ పురాణాన్ని భక్తులకు వివరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందచేశారు. సుదూర ప్రాంతాల నుంచి కార్లు, ఆటోలు, డీసీ ఎంలలో కుటుంబ సభ్యులతో వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లోని దైత(వనదేవత) ప్రాగణం, చెట్ల కింద వంటలు చేసుకుని సాయంత్రం వర కు స్వామివారి సన్నిధిలో సంతోషంగా గడిపారు.

20న హుండీల్లోని కానుకల లెక్కింపు

మల్లూరులోని హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో 10 రోజులపాటు నిర్వహించిన స్వామివారి బ్రహ్మోత్సవాలు(జాతర) ముగిశాయి. దీంతో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హుండీల్లో భక్తులు వేసిన కానుకల లెక్కిపు ఈనెల 20న కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రావణం సత్యనారాయణ ఈ సందర్భంగా వెల్లడించారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద



నర్సంపేట : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

నర్సంపేట/సంగెం/నెక్కొండ: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దని కలెక్టర్ డాక్టర్ సత్యశారద పేర్కొన్నారు. ఈ మేరకు చెన్నారావుపేట మండల కేంద్రం, మగ్ధంపురం, పాపయ్యపేట, సంగెం మండలం కాపులకనిపర్తి, నెక్కొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో అధికారులు అందుబాటులో ఉండాలని, కొనుగోళ్లను నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు పంపించి వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలను వెంటనే ఖాళీ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడకూడదని స్పష్టం చేశారు. లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెన్నారావుపేట మండలం జల్లి గ్రామంలోని రైస్ మిల్లులను తనిఖీ చేసిన కలెక్టర్.. మిల్లులోని రికార్డులు, ధాన్యం తేమ యంత్రాలు, బియ్యం పరిశీలించారు. ధాన్యం వివరాలు, మిల్లు కెపాసిటీ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సహకార శాఖ అధికారి నీరజ, జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, నర్సంపేట, సంగెం, నెక్కొండ తహసీల్దార్లు ఫణికుమార్, రాజ్‌కుమార్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుపై పోలీసుల జులుం!

- వ్యవసాయ భూమిని చదును చేస్తుండగా బెదిరింపులు



జేసీబీతో భూమిని చదును చేయిస్తున్న రైతు

వర్ధన్నపేట: వ్యవసాయ భూమిలో మట్టిని చదును చేస్తుండగా రైతును పోలీసులు బెదిరించిన సంఘటన ఆదివారం వర్ధన్నపేటలో జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. వర్ధన్నపేటకు చెందిన గాదె వెంకటయ్యకు శివాలయం వీధి సమీపంలో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. వరదతో ఈ భూమి కోతకు గురైంది. ఆ భూమిలోని మట్టిని కోతకు గురైన చోటుకు తరలించడానికి జేసీబీ, ట్రాక్టర్లను అద్దెకు తీసుకొచ్చాడు. ఎలాంటి అనుమతి లేకుండా మట్టి, మొరాన్ని తరలిస్తున్నావని పోలీసులు వచ్చి రైతును బెదిరించారు. మట్టి, మొరాన్ని బయటకు తరలిస్తే నేరం అవుతుందని, తన పొలంలోని మట్టితో చదును చేసుకుంటుంటే ఎలా నేరం అవుతుందని సదరు రైతు ప్రశ్నించడంతో కంగుతిన్న పోలీసులు చేసేదేమి లేక వెనుదిరిగారు. రైతును బెదిరించి డబ్బులు వసూలు చేసేందుకు పోలీసులు ఇలా చేశారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై ఎస్సై రాజును వివరణ కోరగా చెరువు నుంచి మట్టి, మొరం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఇద్దరు కానిస్టేబుళ్లను పంపించాను. పొలంలోని మట్టితోనే రైతు చదును చేసుకుంటున్నట్లు గమనించారు. కానిస్టేబుళ్లు ఎవరిని బెదిరించలేదని పేర్కొన్నారు.

అత్యాధునిక వసతులతో రైల్వేస్టేషన్

- రూ.25.41 కోట్లతో అభివృద్ధి పనులు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, నేతలు

ఖిలా వరంగల్: కేంద్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ తరహాలో అత్యాధునిక హంగులు, వసతులతో రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. ఆదివారం వరంగల్ రైల్వేస్టేషన్‌ను మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, అరూరి రమేశ్, బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావుతో కలిసి గంట రవికుమార్ సందర్శించారు. ఈసందర్భంగా రూ.25.41 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌ను ఈనెల 22న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు రత్న సతీశ్, డాక్టర్ వన్నాల వెంకటరమణ, తాబేటి వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



పుష్కర ఘాట్ వద్ద సరస్వతి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు



భక్తజన ప్రవాహం

- సరస్వతి నది పుష్కరాలకు పోటెత్తిన భక్తులు
- తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు రద్దీ
- ఆలయాల్లో దర్శనాలు.. పుష్పగిరి పీఠాధిపతి విద్యాభారతిస్వామి పూజలు
- సుమారు 1.80 లక్షల మంది పుష్కర స్నానాలు
- పర్యవేక్షించిన కలెక్టర్ రాహుల్‌శర్మ



వాహనాలతో నిండిపోయిన పార్కింగ్ స్థలాలు

భూపాలపల్లి/కాళేశ్వరం: సరస్వతి నది పుష్కరాలకు భక్తుల తాకిడి పెరిగింది. ఆదివారం సెలవు కావడంతో నాలుగో రోజు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక నుంచి భక్తులు కాళేశ్వరానికి బారులుదీరారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతినదిలో పుష్కర స్నానాలు ఆచరించి నదీమాతకు చీర, సారె సమర్పించా రు. ముత్తయిదువ మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పలువురు పిండ ప్రదాన పూజలు చేశారు. పితృదేవతలకు తర్పనాలు నిర్వహించారు. పుష్కరిని భక్తులతో నిండిపోయింది. స్టాళ్లలో ఏర్పాటుచేసిన ఫుడ్‌కోర్టు, ఖాదీవస్త్రాలు, పిల్లల ఆటలు, టెంట్‌సిటీలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

1.80 లక్షల మంది భక్తుల స్నానాలు..

వివిధ రాష్ట్రాల నుంచి ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాల్లో తెల్లవారుజాము నుంచి భారీగా భక్తులు సరస్వతినదిలో పుష్కరస్నానాలు ఆచరించారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం ఒక్కరోజు 1.80 లక్షల మంది భక్తులు పుష్కరస్నానాలు చేసినట్లు అధికారుల అంచనా వేశారు. కలెక్టర్ రాహుల్‌శర్మ భక్తులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు.

నదీహారతికి పెరిగిన భక్తులు..

నాలుగు రోజులుగా సరస్వతి ఘాట్‌లో కాశీపండితులతో ఏర్పాటు చేసిన నవరత్నమాలిక హారతికి భక్తుల తాకిడి పెరుగుతోంది. ఏడు గద్దెలపై తొమ్మిది హారతులను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విద్యుత్ వెలుగుల్లో హారతి ఇస్తున్నారు.



పుష్కర ఘాట్ వద్ద భక్త జనసందోహం



గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

పుష్పగిరి పీఠాధిపతికి స్వాగతం

పుష్పగిరి పీఠాధిపతి విద్యాభారతిస్వామి సరస్వతినదిలో పుష్కర స్నానాలు చేశారు. నదికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం రాజగోపురం వద్దకు రాగా ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకుని అభిషేక పూజలు చేశారు.

సెలవురోజు పెరిగిన రద్దీ..

వీకెండ్ కావడంతో రద్దీ పెరిగింది. హైదరాబాద్, వరంగల్, భూపాలపల్లి మీదుగా, మంథని, కాటారం మీదుగా భారీగా వాహనాలు తరలివచ్చాయి. ట్రాఫిక్ జాం కాకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. కార్లు, ఆర్టీసీ బస్సుల్లో వచ్చిన భ క్తులను వీఐపీఘాట్ సమీప, ఇప్పలబోరు, బస్టాండ్ వద్ద పార్కింగ్ ప్రాంతాలకు తరలించారు.

బొగత కనువిందు

ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగత జలపాతానికి భారీగా నీరు వచ్చి చేరింది. మండలంలో రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు గుట్టలపై నుంచి వాగు పొంగడంతో జలధారలు దర్శన మిచ్చి కనువిందు చేస్తున్నాయి. మండు వేసవిలో జలపాతం ఇలా జాలువారడం విశేషం.

- వాజేడు



క్లుప్తంగా

హామీల అమలులో కేంద్రం విఫలం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మహాసభలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

ఎల్కతుర్తి: హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల పదో మహాసభలకు ఆయన ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో నిత్యావసరాల ధరలు తగ్గిస్తామని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అందిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన ప్రధాని నరేంద్రమోదీ.. ఆ హామీల అమలులో పూర్తిగా విఫలం చెందారన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ మనుధర్మ శాస్త్ర అమలుకు కుట్ర పన్నుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిక హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, మద్రి శ్రీనివాస్, కర్రె లక్ష్మణ్, సంతోశ్, రాజ్‌కుమార్, బొంత మల్లయ్య, నిమ్మల మనోహర్, ఉట్కూరి ప్రణీత్, విజయ్, రాజనర్సు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో అనాథ వృద్ధుడి మృతి

- అంత్యక్రియల కోసం వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు
- గంటలో రూ. 51 వేలు జమ చేసిన గ్రామస్తులు



మల్లయ్య మృతదేహం

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన అనాథ వృద్ధుడు ఒడ్డూరి మల్లయ్య (75) వడదెబ్బతో మృతి చెందాడు. మల్లయ్య గతంలో గ్రామంలోని జెంగిడి బర్రెలకు (పాడి గేదెలు) కాపరిగా పని చేసేవాడు. కాలక్రమేణా పాడిగేదెలు తగ్గిపోవడంతో జీవనోపాధి కరువైంది. దీంతో పశువుల ఆస్పత్రి సమీపంలో డేరా వేసుకుని ఒంటరి జీవితం గడుపుతూ గ్రామస్తులు అన్నం పెడితే కడుపునింపుకునేవాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం వడదెబ్బతో చనిపోయినట్లు గ్రామస్తులు గుర్తించారు. మృతుడి అంత్యక్రియలకు ఆర్థిక సాయం చేయాలని తాజా మాజీ సర్పంచ్ ముప్పిడి శ్రీధర్ ఆ గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయగా గ్రామస్తులు వెనువెంటనే స్పందించారు. దాదాపు గంటలో రూ. 51 వేలు జమ చేశారు. ఆ డబ్బుతో మల్లయ్య దహన సంస్కారాలు పూర్తి చేసి దాతృత్వం చాటారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661



నీళ్లారగిస్తున్న మహిళలు



మొక్కుతున్న యువతి

పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తులు



కాళేశ్వరం.. జనసంద్రం



నది తీరంలో భక్తుల రద్దీ



పుష్కరాలకు వస్తున్న భక్తులు



స్నానం ఆచరిస్తున్న యువతి



స్నానం ఆచరించి మొక్కుతున్న మహిళలు



పిండ ప్రదాన పూజలు చేయిస్తున్న పురోహితులు



స్నానం ఆచరించే ముందు మొక్కుతున్న భక్తులు



నది తీరంలో భక్తుల రద్దీ



వాయినం ఇచ్చి పుచ్చుకుంటున్న మహిళలు



నదిలో ప్రమిదను వదులుతున్న భక్తులు



తీర్థప్రసాదం తీసుకుంటున్న మహిళ



సెల్ఫీ దిగుతున్న యువతులు

అన్నదానం.. మహాప్రసాదం

- పుష్కరాల భక్తులకు పలు ట్రస్ట్‌ల నిత్యాన్నదానం
- పన్నెండు రోజుల పాటు ఉచితంగా టిఫిన్, భోజనం
- భక్తుల ఆకలి తీరుస్తున్న సత్రాలు

కాటారం /మల్హర్: అన్నం పరబ్రహ్మ స్వరూపం. ఆకలితో ఉన్న వారికి ఒక పూట భోజనం పెట్టినా చాలు ఎంతో పుణ్యం లభిస్తుంది. అందుకే సేవాభావంతో పలువురు ప్రముఖ దైవక్షేత్రాల్లో నిత్యాన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అదే మాదిరి ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీనది పుష్కరాల నేపథ్యంలో ముక్తీశ్వరాలయ సమీపంలో దాదాపు 8 చోట్ల అన్నదాన సత్రాలు ఏర్పాటు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాల నుంచి అన్నదాతలు ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేసి భక్తుల కడుపునింపుతున్నారు. ఒక్క పూటకు నాలుగు నుంచి ఆరు వేల మంది భక్తులకు ఉచిత అన్నదానాలు చేస్తున్నారు.

ప్రతీ రోజు టిఫిన్, అన్నదానం..



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

సరస్వతీనది పుష్కరాల సందర్భంగా ఆర్యవైశ్య, బ్రాహ్మణ, ఈశ్వరకుమారి, వాసవీ క్లబ్, ఇతరాత్ర ట్రస్ట్‌ల ద్వారా ఏర్పాటు చేసిన అన్నప్రసాద సత్రాల ద్వారా భక్తులకు ప్రతీ రోజు టిఫిన్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఏదో ఉచిత భోజనం అందిస్తున్నామనే కాకుండా నిర్వాహకులు నాణ్యతతో కూడిన రుచికర భోజనం అందిస్తున్నారు. ఉదయం పలు రకాల అల్పాహారంతోపాటు భోజనంలో రెండు రకాల కూరలు, పప్పు, సాంబారు, పెరుగు, స్వీట్లు, పచ్చడి పెడుతున్నారు. రుచికరం, పరిశుభ్రంగా ఉండడంతో భక్తులు సత్రాల్లో భోజనం చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

భోజన సౌకర్యం బాగుంది..



సరస్వతీనది పుష్కరాలకు రెండు రోజుల క్రితం కుటుంబ సమేతంగా వచ్చాం. అన్నదాన సత్రాల్లో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం చేస్తున్నాం. చాలా రుచిగా, శుభ్రంగా ఉంది.

- అనురాధ, భక్తురాలు, మంచిర్యాల

సేవలు అభినందనీయం..



పుష్కరాలకు పిల్లలతో కలిసి చాలా దూరం నుంచి వచ్చాం. మధ్యాహ్నం భోజనం చేయడానికి ఇబ్బంది అవుతుందని ఆందోళన చెందాం. కానీ తీరా ఇక్కడికి వచ్చి చూస్తే అన్నదాన సత్రాల్లో భోజనం లభించింది. సమయానికి మా ఆకలి తీరింది. అన్నదానం నిర్వాహకుల సేవలు అభినందనీయం.

- శ్రీనివాస్, భక్తుడు, కరీంనగర్

19 సంవత్సరాలుగా అన్నదానం..

కాళేశ్వరం వచ్చే భక్తులకు భోజన సౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో మా తండ్రి గుడాల కృష్ణమూర్తి 2007లో కాళేశ్వర ముక్తీశ్వర శ్రీ వాసవి అన్నపూర్ణ నిత్యాన్నదాన సత్రం ఏర్పాటు చేశారు. 19 సంవత్సరాలుగా ప్రతీ పుష్కరానికి భోజన సౌకర్యం కల్పిస్తున్నాం. మిగతా రోజుల్లో అనేక మంది కాళేశ్వరం వచ్చే ఆర్యవైశ్య భక్తులకు భోజనం అందజేస్తున్నాం. ప్రతీ రోజు భోజనం అందించడం ఆనందంగా ఉంది.

- జానకీమణికుమార్, సత్రం నిర్వాహకురాలు

ఆనందంగా ఉంది..



కాళేశ్వరం వచ్చే భక్తులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉంది. 2015లో గోదావరి పుష్కరాల్లో, 2022 ప్రాణహిత పుష్కరాల్లో కూడా 12 రోజుల పాటు కాళేశ్వరంలో అన్నదానం చేశాం. 12వ పుష్కరం సరస్వతీనది పుష్కరాలకు కూడా అన్నదానం చేస్తున్నాం. భక్తుల కడుపు నింపడం మాకు ఆనందంగా ఉంది.

- సోమ వెంకటయ్య,అన్నదాన, నిర్వాహకుడు

ప్రముఖుల పుష్కర స్నానం..



సరస్వతీనదిలో పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి దంపతులు



సరస్వతి ఆలయంలో పూజలు చేస్తున్న సినీనటుడు రాజేంద్రప్రసాద్

కాటారం/కాళేశ్వరం: పవిత్ర పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీనది పుష్కరాల్లో భాగంగా ఆదివారం పలువురు ప్రముఖులు పుష్కర స్నానం ఆచరించారు. హైకోర్టు జడ్జి సుధా దంపతులు, ప్రముఖ సినీనటుడు రాజేంద్ర ప్రసాద్, జెన్‌కో డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్ అనురాధ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న.. సరస్వతి(వీఐపీ)ఘాట్‌లో పుష్కర స్నానం చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం చేరుకుని స్వామి వారికి, సరస్వతీమాతా, శుభానందాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు హైకోర్టు జడ్జి సుధాకు కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే స్వాగతం పలికి మొక్కను బహూకరించారు.

నిఘా నీడలో కాళేశ్వరం



కంట్రోల్ రూంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

భూపాలపల్లి/కాళేశ్వరం: సరస్వతీనది పుష్కరాల సందర్భంగా పోలీసులు ముందస్తు నిఘా నేత్రాలు ఏర్పాటు చేశారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతం, మహారాష్ట్ర- తెలంగాణ సరిహద్దులో కాళేశ్వరం ఉండడంతో అంతర్రాష్ట్ర వంతెన నుంచి మొదలు.. శ్రీకాళేశ్వర ముక్తీశ్వర దేవాలయం, పరిసర ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలు, పుష్కర ఘాట్, ప్రధాన రహదారుల్లో సుమారు 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటన్నింటినీ కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేసి నిత్యం పరిశీలిస్తున్నారు. ఫలితంగా ఇప్పటి వరకైతే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు.

ఎండవేడితో భక్తుల అస్వస్థత



వీఐపీ ఘాట్ వద్ద అస్వస్థతకు గురైన భక్తుడిని తరలిస్తున్న సింగరేణి రెస్క్యూ సిబ్బంది

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరంలో ఎండ వేడితో భక్తులు అస్వస్థతకు గురవుతున్నారు. పుష్కరాలో భాగంగా నాలుగో రోజు ఆదివారం 8 మంది భక్తులు ఎండవేడికి అస్వస్థతకు గురికాగా 108లో కాళేశ్వరం పీహెచ్‌సీకి తరలించారు. పీహెచ్‌సీలో ఆదివారం 156 మందికి ఓపీ పరీక్షలు నిర్వహించగా 30 మంది భక్తులను అడ్మిట్ చేసుకున్నారు. కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన క్యాంపుల ద్వారా సుమారు 4వేల మంది భక్తులకు వైద్య సేవలు అందించామని డీఎంహెచ్‌ఓ మధుసూదన్ తెలిపారు.

కలెక్టర్ జాయ్ రైడ్..



జాయ్ రైడ్‌కు వెళ్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ జాయ్ రైడ్ చేసి సరస్వతీనది పుష్కర సదుపాయాలను పరిశీలించారు. ఆదివారం ఉదయం కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, కరీంనగర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి హెలికాప్టర్‌లో పుష్కర పరిసరాలు పరిశీలించారు. పుష్కర ఘాట్‌లు, రహదారి సదుపాయాలు, శానిటేషన్, పారిశుద్ధ్య చర్యలు, టెంట్ సిటీ, స్టాళ్లు, భద్రతా ఏర్పాట్లును పరిశీలించారు. అనంతరం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు హెలికాప్టర్ ద్వారా త్రివేణి సంగమం, కాళేశ్వర దేవస్థానం, కాళేశ్వరం చుట్టు పక్కల అడవులు, తదితర అందాలను వీక్షించడానికి జాయ్ రైడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ రాక

భూపాలపల్లి: సరస్వతీనది పుష్కరాలకు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సోమవారం రోడ్డు మార్గాన కాళేశ్వరం రానున్నారు. ఉదయం 10.30 గంటలకు కాళేశ్వరం చేరుకుని పుష్కర స్నానం ఆచరించిన అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుంటారు. 12 గంటలకు తిరిగి కరీంనగర్‌కు వెళ్లనున్నారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కూడా సోమవారం కాళేశ్వరం రానున్నట్లు సమాచారం.

24న రైతు చర్చా వేదిక



మాట్లాడుతున్న ఐలవేణి శ్రీనివాస్

భూపాలపల్లి రూరల్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్ హౌస్‌లో నేషనల్ హ్యూమన్‌రైట్స్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఎన్జీఓ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన రైతు చర్చా వేదిక నిర్వహించనున్నట్లు ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఎన్జీఓ జాతీయ అధ్యక్షుడు ఐలవేణి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవన్‌లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడు సురేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఐలవేణి శ్రీనివాస్‌తోపాటు రాష్ట్ర అధ్యక్షుడు నక్క గంగారాం ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. చర్చా వేదికకు విశిష్ట అతిథిగా సీబీఐ జాయింట్ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ రానున్నారని తెలిపారు. అదేవిధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని, వ్యవసాయ అనుబంధ రంగాల సంబంధించిన అధికారులు, మేధావులు కూడా పాల్గొంటారని చెప్పారు.

ముగిసిన నెట్‌బాల్ పోటీలు

- విజేతలకు బహుమతుల ప్రదానం

జనగామ: జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంటలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి 8వ సబ్ జూనియర్ బాల బాలికల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి 620 మంది బాలురు, బాలికా క్రీడాకారులు హాజరయ్యారు. ట్రెడిషినల్, ఫాస్ట్-5, మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. ట్రెడిషినల్, ఫాస్ట్-5 పోటీలు ఈనెల 17న ముగియగా.. చివరగా మిక్స్‌డ్ డబుల్స్ పోటీలతో ముగింపు పలికారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో మహబూబ్‌నగర్ (విన్నర్), కామారెడ్డి(రన్నర్), థర్డ్ ప్లేస్‌లో వరంగల్/నాగర్ కర్నూల్ సంయుక్త విజేతలుగా నిలువగా, మూడు కేటగిరీల్లో విజయం సాధించిన టీంలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు.

ఉద్యమ జీవి నల్లెల రాజయ్య

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యనవీన్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అంపశయ్యనవీన్, తదితరులు

విద్యారణ్యపురి: ఉద్యమ జీవి నల్లెల రాజయ్య చిరస్మరణీయుడని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యనవీన్ అన్నారు. ఆదివారం హనుమకొండ ప్రాక్టీసింగ్ ప్రైమరీ స్కూల్‌లో నిర్వహించిన 'ప్రజల మనిషి నల్లెల రాజయ్య' పుస్తకాన్ని ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించి మాట్లాడారు. సి. చంద్ర ప్రధాన సంపాదకుడిగా, అనిశెట్టి రజిత, డాక్టర్ కెబి. చంద్రభాను, బిల్ల మహేందర్, పిట్ట సాంబయ్య, రౌతు అజయ్‌కుమార్ సంపాదక వర్గం సభ్యుల ఆధ్వర్యంలో వ్యాసాల సంపుటి(పుస్తకం)ని రూపొందించారు. కేయూ రిటైర్డ్ ఆచార్యుడు బన్నఅయిలయ్య,ప్రముఖ కవి వీఆర్ విద్యార్థి, టీపీఎఫ్ కన్వీనర్ రమాదేవి మాట్లాడారు. కవి కోడం కుమారస్వామి పుస్తకాన్ని సమీక్షించారు. వ రంగల్ రచయితల సంఘం కార్యదర్శి దండ్రె రాజమౌళి, వివిధ ప్రజాసంఘాల బాధ్యులు భిక్షపతి, తిరుపతయ్య, సాంబయ్య, ఉదయ్‌సింగ్, మెట్టురవీందర్, జీడి. సారయ్య, మార్కశంకర్‌నారాయణ, కె. శంకర్‌రావు, వి. దిలీప్, బండారు సుజాత, బోనగిరి రాములు, ఎ. విద్యాదేవి, రాజేంద్రప్రసాద్, కుటుంబీకులు సుగుణ, వెన్నెల, సూర్య పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

- ఆంధ్రజ్యోతి ఆఫీస్ దగ్గర విశాల్ హౌసింగ్ సొసైటీలో 125 చ॥గజాల స్థలం అమ్మబడును. సంప్ర॥ 9652808815. [WA-6600]
- నర్సంపేట రోడ్‌కి 8KM దూరంలో లక్ష్మీపురంలో కాదకుహౌ ఫామ్‌లో 120గ॥ 6 లక్షలు. కొన్నవారికి ప్రతి నెల ఆదాయం 6 వేలు, 100 నెలలు ఇవ్వబడును. 2 లక్షల డౌన్ పేమెంట్‌తో వాయిదాలలో ప్లాట్. 9110773550. [WA-7564]

KUDA అప్రూవ్డ్ ప్లాట్స్

- KUDA అప్రూవ్డ్ లే అవుట్ రెసిడెన్షియల్ ప్లాట్స్ ఎడ్యుకేషన్ కారిడార్ ఎల్కతుర్తి NH-563 ఫేసింగ్ ప్రపోస్డ్ IIIT క్యాంపస్, సబ్ కోర్ట్ ప్రక్కన అభివృద్ధి చేయబడిన వెంచర్‌లో ఈ రోజు బుక్ చేసుకోండి మంచి ఇన్వెస్ట్‌మెంట్, వెంటనే ఇల్లు కట్టుకోవడానికి వివరాలకు సంప్ర॥ 9866943026. [WA-6597]

SERVICES

- కపిల్ చిట్స్‌లో బ్రొకెన్ చిట్స్ కలవు. ష్యూరిటీ పెట్టి స్పాట్ క్యాష్ ఇప్పించబడును. ఆసక్తిగలవారు సంప్రదించండి 8790379618. [WA-6599]

BUSINESS SERVICES

- మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 91600 77916 స్పాట్ క్యాష్ [H-783415]
- ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, నలహాలకి కాల్ చేయండి : 7406393937 [HA-462]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

WANTED

- PROs needed for getting candidates for computer institute in Hanamkonda should do admissions and explain about courses. Freshers can also apply. Send resumes to hr@megainformatics.com and Whatsapp: 085230 92239. [SCA25003965]
- Hema Hyundai needs for workshop AC Tech -1 & Junior Tech-2-ITI must, Washing Helper -2 Quli: 10 pass for Jangaon & WGL, Washing Supervisor -1 Quli: Any Degree Final Inspector - Quli: ITI must with min 10 yrs Exp Walk in Interview with resume on 19th & 20th May 2025 between 11 am to 2.pm. Cont: Hema Hyundai Service Shed No B-5, Industrial estate, Mulugu road, Wgl Cell: 97030 48686. [WA-15654]
- Hema Motors needs Sales executive, any degree, Two wheeler must, Tele callers any degree, only females EDP, degree must, Walk in Interview with resume on 19th & 20th May 2025 between 11 am to 2.pm Cont: Hema Motors Pvt Ltd, Opp: Govt ITI, Mulugu Road, Wgl, Cell: 8008204442, 9154921942. [WA-15656]
- Hema Motors needs Drivers, min.edu.qualification Inter, LMV driving licence with badge required, min 3-5 years of experience. Walk in Interview with resume on 19th & 20th May 2025 between 11 am to 2.pm Cont: Hema Motors Pvt Ltd, Opp: Govt ITI, Mulugu Road, Wgl, Cell: 8008204442, 9154921942 [WA-15655]

తాజా వార్తల కోసం లాగిన్ అవ్వండి www.sakshi.com

- Interested Candidates (including retired bank staff) may apply to work in Bhadradri Co-operative Urban Bank Ltd., Khammam. For details refer website www.bhadradribank.com, Last Date: 31-05-2025. Contact No. 96033 66343. [MH-13471]
- Computer Operator needed in Degree College, should have good English, MS Office and typing Skills. Freshers can apply. Send Resume to abap4sandeep@gmail.com [SCA25003723]
- పెట్రోల్ బంక్‌లో పనిచేయడానికి ఎయిర్ బాయ్ కావాలి. హంటర్ రోడ్, హనుమకొండ, వరంగల్. Cell: +91 9985340543 [WA-7563]
- ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. ఫోన్ 8977639663, 8977639662 [SCA25003891]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.